సంక్షేమ పథకాలపై కళాబృందం ప్రదర్శనలు 8
పంట నూర్పిడికి కూలీల కొరత 7
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం ఎప్పుడో! 7
బూత్‌బంగ్లాగా పేదల కల్యాణ వేదిక 8

మహిళా సంఘాల నిర్వహణ బాగుంది


మహిళా సంఘాల సభ్యులతో ఇతర రాష్ట్రాల బృందం సభ్యులు

» మహిళా సంఘాల సందర్శనలో ఐదు రాష్ట్రాల ప్రతినిధులు

భిక్కనూరు, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల నిర్వహణ తీరు బాగుందని సందర్శనకు వచ్చిన ఐదు రాష్ట్రాల ప్రతినిధులు చెప్పారు. మండలంలోని ఆయా గ్రామాల మహిళా సంఘాలను శుక్రవారం ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, జమ్మూకాశ్మీర్, జార్ఖండ్ రాష్ట్రాల ప్రతిని ధుల బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయాగ్రామాల మ హిళా సంఘాలలో సమావేశాలు, కట్టుబాట్లు, పుస్తక నిర్వహణ, ఆడిట్ విధా నం, కమిటీల నిర్వహణ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డు లను, పుస్తక నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ భిక్కనూరు మండల మహిళా సంఘాల పనితీరు బాగుందని ప్రశంసించారు. కార్యక్రమంలో ఏపీఎం సాయిలు, సమాఖ్య అధ్యక్షురాలు రాజమణి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందించాలి

» జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి

బీర్కూర్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): రైతులకు సమయానుకూలంగా ఎరువులు అందించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి అన్నారు. బీర్కూర్ మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. బీర్కూర్‌లో గల ప్రైవేటు పురుగుల మందులు, ఎరువులు, విత్తనాలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు సక్రమంగా అందించాలని, స్టాక్ రిజిస్టర్లను నిర్వహించాలని ఆదేశించారు. యాసంగి సీజన్ ఏర్పాట్లపై విండో కార్యదర్శులు, ప్రైవేట్ ఇన్‌పుట్ డీలర్లతో మాట్లాడారు. ఈపాస్ ద్వారా ఎరువులు అమ్మకాలు చేయాలన్నారు. విత్తన చట్టం, నాణ్యత నియంత్రణ సంబంధిత మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బాన్సువాడ ఏడీఏ అరుణ, ఏఓ కార్తీక్, ఏఈఓలు పాల్గొన్నారు.


పురుగుల మందుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న డీఏవో


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

సమాజ నిర్మాణానికి వృద్ధుల అనుభవం అవసరం

» కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్

కామారెడ్డిటౌన్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల అనుభవం సమాజ నిర్మాణానికి ఎంతో అవసరమని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వయోవృద్ధుల జ్ఞానం, విలువలు సమాజ నిర్మాణానికి ఎంతో తోడుపాటును అందిస్తాయని తెలిపారు. వారికి గౌరవం, ఆరోగ్యం, భద్రత కల్పించడం ప్రతీఒక్కరి బాధ్యతని అన్నారు. వయోవృద్ధుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. వయోవృద్ధులకు నిర్వహించిన వివిధ రకాల క్రీడల్లో గెలుపొందిన వారికి మెమొంటోలు అందించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో ప్రమీల, తహసీల్దార్ జనార్ధన్, మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్‌రావు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు శిక్షణ, రవాణ, భద్రత, మౌలిక వసతులు, కమ్యూనికేషన్, వ్యయ పర్యవేక్షణ వంటి కీలక విభాగాలకు నోడల్ అధికారులను నియమించామన్నారు. పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లు, మౌళిక సదుపాయలు, తాగు నీరు, విద్యుత్, ర్యాంపులు, ఇతర సౌకర్యాలను సిద్ధం చేయాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, మదన్‌మోహన్, సబ్‌కలెక్టర్ కిర్మయి, జడ్పీ సీఈవో చందర్, డిప్యూటీ ట్రైని కలెక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు అక్షరాభ్యాసం
టీచర్లకు టెట్ అభ్యాసం



» టీచర్లలో టెట్ టెన్షన్!
» ఓవైపు విద్యార్థులకు పాఠాలు.. మరోవైపు టెట్ ప్రిపరేషన్
» జిల్లాలో 4,341 ప్రభుత్వ ఉపాధ్యాయులు
» టెట్ రాయనున్న 2,228 మంది ఉపాధ్యాయులు
» మరో 4వేల మంది నిరుద్యోగ యువత
» సర్వీస్ ఉపాధ్యాయులు అర్హత సాధించాల్సిందే..
» ఉత్తీర్ణతకు రెండేళ్ల గడువు
» ఎన్‌సీటీఈ మార్గదర్శకాలు
» ఈనెల 29 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఉపాధ్యాయులకు అర్హత పరీక్ష కష్టాలు

సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ టెన్షన్ పట్టుకుంది. విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి పలు మార్పులు చేశారు. విద్యార్హతలతో పాటు వృత్తిసామర్థ్యాలను మరింతగా పరీక్షించి నాణ్యమైన అభ్యర్థులను ఎంపిక చేయాలనే ఉద్దేశ్యంతో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను ప్రవేశపెట్టారు. అయితే సెప్టెంబరు 1న ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) విడుదలచేసిన మార్గదర్శకాల ప్రకారం టెట్ అర్హత తప్పనిసరి అవనుండడంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది.

కామారెడ్డి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు విధుల్లో కొనసాగాలన్నా.. పదోన్నతి పొందాలన్నా.. టెట్ ఉతీర్ణతకు రెండేళ్ల గడువు విధించడం ఆందోళనకు గురిచేస్తోంది. 2012 డీఎస్సీ డీఎస్‌సీ ద్వారా ఎంపికైన వారు టెట్ అర్హత కలిగి ఉన్నారు. అంతకముందు బీఈడీతో పరీక్ష రాసి ఉద్యోగం చేరిన వారికి టెట్ లేకపోవడం అయోమయంలో పడేసింది. ఉద్యోగ విరమణకు దగ్గరున్న పదోన్నతుల పొందాలనుకునే టీచర్లను నిరాశ గురిచేస్తోంది. అయితే సుప్రీంకోర్టు తీర్పు, ఎన్‌సీటీఈ మార్గదర్శకాల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదని ఉపాధ్యాయసంఘాలు పేర్కొంటున్నాయి. తమిళనాడు,కేరళ లాంటి రాష్ట్రాల్లో మాదిరి తెలంగాణ ప్రభుత్వం టెట్‌పై సుప్రీంకోర్టులో రివ్యూపిటిషన్ వేయాలని కోరుతున్నాయి.

600 మంది మాత్రమే అర్హత

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ల పరిధిలో 670 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీల భర్తీకి రానున్న టెట్ ముఖ్య భూమిక పోషించనుంది. జిల్లాలో పీఎస్, యూపీఎస్, ఉన్నత పాఠశాలల పరిధిలో 4,341 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఇందులో జిల్లాలో 2010కి ముందు చేరిన 2,828 మంది ఉపాధ్యాయులకు టెట్ రాయడం తప్పని సరి. వీరిలో ఇప్పటి వరకు సుమారు 600ల మంది మాత్రమే టెట్ అర్హత సాధించినట్లు తెలుస్తోంది. మిగతా 2,228 మంది అర్హత పరీక్ష ద్వారా తమ భవిష్యత్తును పరీక్షించుకోనున్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో (మిగతా 8లో..)

రెండేళ్లలో టెట్ అర్హత సాధించాలి

విద్యాహక్కు చట్టం ప్రకారం 2010 నుంచి టెట్ (టీచర్ ఎలిజిబులిటి టెస్ట్) అమలులోకి వచ్చింది. ఎస్‌జీటీలు అయితే టెట్ పేపర్-1, స్కూల్‌అసిస్టెంట్‌లు అయితే పేపర్-2 రాయాలి. 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులు అందరూ టెట్ అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుంది. 2030 సెప్టెంబరు 30లోపు ఉద్యోగవిరమణ చేసేవారు రాయనవసరం లేదు. అయితే ఐదేళ్లలో ప్రమోషన్ పొందాలంటే టెట్ తప్పనిసరి. ఐదేళ్లకుపైగా సర్వీస్ ఉన్నవారు తప్పనిసరిగా రెండేళ్లలో టెట్ అర్హత సాధించాలి.

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు మినయింపు ఇవ్వాలి



• అల్లపూర్ కుషాల్, జిల్లా అధ్యక్షుడు, పీఆర్టీయూ

టెట్ క్వాలిఫై కావాలనే నిబంధన నుంచి ఇన్‌సర్వీస్ టీచర్లకు మినయింపు ఇవ్వాలి. 25 ఏళ్లుగా పనిచేసిన ఉపాధ్యాయులు ఇటూపాఠాలు విద్యార్థులకు బోధిస్తూ టెట్‌కు ప్రిపేర్ కావాలన్న పరిస్థితితో చాలామంది ఉపాధ్యాయులు ఆందోళన ఒత్తిడికి గురవుతున్నారు. ప్రస్తుతం బోధిస్తున్న సబ్జెట్‌లకు సంబంధం లేకుండా టెట్ ప్రశ్నాపత్రాలు ఉంటున్నాయి. కేంద్రప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని సవరించాలి. 2010 కంటే ముందు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినాయింపు ఇవ్వాలి.


మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో విద్య

శిశు మరణాలను తగ్గించడమే లక్ష్యంగా పని చేయాలి

» డీఎం అండ్ హెచ్‌వో డా. విద్య

బాన్సువాడటౌన్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): శిశుమరణాలను తగ్గించడమే లక్ష్యంగా పనిచేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో డా. విద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణంలోని మాతాశిశుసంరక్షణ ఆస్పత్రిలో బాన్సువాడ డివిజన్ పరిధిలోని ఫీల్డ్ సూపర్‌వైజరీ కేడర్‌తో ఆమె ఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ శిశు వారోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలు ఇచ్చే విధానం, కంగారు మదర్ కేర్, ఇన్ఫెక్షన్ నియంత్రణ పద్ధతులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో రోహిత్, సీహెచ్‌వో దయానంద్, సుధాకర్, సిబ్బంది తదితరులున్నారు.

రేపు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

కామారెడ్డి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌ను ఈనెల 23న ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీఈవో రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హాల్‌టికెట్‌లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ బీఎస్‌ఈ.తెలంగాణ.జీవోవి.ఇన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి యూజర్‌ఐడీ, పాస్వర్డ్, డెట్‌ఆఫ్‌బర్త్‌తో డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్, బాల్‌పాయింట్ పెన్, పరీక్ష ప్యాడ్‌లతో పరీక్ష కేంద్రానికి గంటముందు చేరుకోవాలని సూచించారు.

తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బీబీ పాటిల్

బీర్కూర్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పార్లమెంట్ మాజీ సభ్యుడు బీబీ పాటిల్ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా బీర్కూర్ మండలానికి చెందిన వీరశైవ లింగాయత్ సమాజ సభ్యులు శుక్రవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


మాజీ ఎంపీని కలిసిన లింగాయత్ సభ్యులు


సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ, పాల్గొన్న పోలీసు అధికారులు

ప్రతీ కేసును క్షుణ్ణంగా
దర్యాప్తు చేయాలి

» పోలీసు అధికారులతో నెలవారి సమీక్షలో ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డిటౌన్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో నమోదైన ప్రతీ కేసును క్షుణ్ణంగా దర్యాప్తు చేసి బాధితులకు అండగా నిలవాలని ఎస్పీ రాజేష్‌చంద్ర సిబ్బందికి సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసుకార్యాలయంలో పోలీసు అధికారులతో నెల వారి నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్‌వోలు తమ ఏరియాలోని ప్రతీ గ్రామాన్ని సందర్శించి ఆ ప్రాంత సమస్యలను తెలుసుకోవాలని అన్నారు. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి ముందస్తూ సమాచారాన్ని సేకరించి ఏ ఘటన జరిగిన సమాచారం వచ్చే విధంగా గ్రామస్థులతో సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రౌడి షీటర్స్, సస్పెక్ట్‌ల కదలికల పై నిఘా ఉంచి తరుచు చెక్ చేయాలన్నారు. బ్లూకోల్ట్స్ నైట్ పెట్రోలింగ్ సిబ్బంది పాపిలోన్ డివైజ్‌లను వినియోగిస్తూ అనుమనితుల ఫింగర్ ప్రింట్స్ సేకరించాలన్నారు. ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించి, మద్యం సేవించి వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రవమాదాలకు కారణమయ్యే వారి పై కేసులు నమోదు చేయాలని సూచించారు.సమావేశంలో ఏఎస్పీలు నర్సింహారెడ్డి, చైతన్యరెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్‌రావు, విఠల్‌రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మధుసుదన్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ మురళి, తదితులు పాల్గొన్నారు.

దొంగనోట్ల తయారీ నిందితుడిపై పీడీ యాక్ట్: ఎస్పీ

కామారె డ్డిటౌన్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): దొంగనోట్ల తయారీ, చెలామణి చేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన నిందితుడు కరెన్సి కాట్నీ అలియాస్ లకన్‌కుమార్ దుబేపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. శుక్రవారం పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి, హెడ్ కానిస్టేబుల్ వీఎల్ నర్సింలులు నిజామాబాద్ సెంట్రల్ జైలులో అధికారులకు లకన్‌కుమార్ దుబేను అప్పగించినట్లు చెప్పారు. కామారెడ్డి పట్టణంలోని ఓ వైన్స్‌లో రెండు నకిలీ రూ.500 నోట్లు వినియోగించిన ఘటనపై మేకల అఖిల్ ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేపట్టి అక్టోబరు 11న 8మంది నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపామని తెలిపారు. అందులో ఒక్కడైన లకన్‌కుమార్ దుబే పై కామారెడ్డిలో, కోల్‌కత్తాలో కేసులు ఉన్నాయని చెప్పారు. ఫెక్ కరెన్సి చెలామణి చేస్తూ ప్రజలను భయభ్రంతులకు గురిచేస్తున్నట్లు పేర్కొన్నారు.

పసికందు విక్రయానికి యత్నం?

» బాన్సువాడలో కలకలం

బాన్సువాడటౌన్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడలోని ఓ ప్రయివేటు నర్సింగ్ హోంలో పసికందును విక్రయించేందుకు చేసిన యత్నం కలకలం రేపింది. నిజాంసాగర్ మండలం నర్వ గ్రామానికి చెందిన ఓ మహిళ రెండురోజుల క్రితం ఓ మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణాలతో కానీ శుక్రవారం ఆ బిడ్డను లింగంపేట్‌కు చెందిన ఓ వ్యక్తికి విక్రయించినట్లు తెలుస్తోంది. ఈ సమాచారాన్ని స్థానికులు కొందరు పోలీసులకు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన బాన్సువాడటౌన్ పోలీసులు ఆ మహిళను గుర్తించి విచారణ చేపట్టినట్లు తెలిసింది. శిశువును అమ్మకానికి ఎందుకు ప్రయత్నించిందనే కోణంలో పోలీసులు ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. అనంతరం పసికందుని సురక్షితంగా స్వాధీనం చేసుకుని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిశువును (మిగతా 8లో..)

నైట్ డ్యూటీ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని డీఈవోకు వినతి


డీఈవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

కామారెడ్డిటౌన్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేజీబీవీలో పనిచేస్తున్న అకౌంటెంట్లకు, వర్కర్లకు నైట్ డ్యూటీలు కేటాయిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టిచింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డీఈవో రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కేజీబీవీ అకౌంటెంట్లకు నైట్‌డ్యూటీలు కేటాయిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలేజీలుగా అప్ గ్రేడ్ అయిన కేజీబీవీల్లో పని భారం విపరీతంగా పెరిగిందన్నారు. హెచ్‌ఎంఎస్ విధానంతో అకౌంటెంట్లు పని ఒత్తిడికి గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సురేష్, కేజీబీవీ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

పొగచూరుతున్న బాల్యం


వంట గది లేక పాఠశాలలోనే ఓ పక్కన వంట చేస్తున్న దృశ్యం

» జిల్లాలో పలు పాఠశాలల్లో వంట గదులు కరువు
» విద్యార్థుల ఆరోగ్యంపై పొగ ప్రభావం
» అధికారులు దృష్టిసారించాలని విద్యార్థుల తల్లిదండ్రుల వేడుకోలు

బాన్సువాడటౌన్,నవంబరు21(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం.. కేవలం కడుపు నింపే భోజనమే కాదు, పేద విద్యార్థులకు అది చదువుపై దృష్టి పెట్టేందుకు ఇచ్చే భరోసా. కానీ నేడు అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఆ భరోసా ప్రమాదంలో పడేస్తోంది. పాఠశాలల్లో సరైన వంట గదుల్లేక ఉన్న గది శిథిలావస్థకు చేరడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు నిస్సహాయులుగా ఉండిపోతున్నారు. విద్యార్థులకు ఎలాగైనా వండిపెట్టాలని ఆరుబయటో, చెట్ల కిందనో లేదా పాత రేకుల షెడ్డు కిందనో వంట చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే చాలా పాఠశాలల్లోనూ ఇలాంటి దృశ్యాలు నిత్యం కనిపిస్తూనే ఉన్నాయి.


శిథిలావస్థకు చేరుకున్న వంటషెడ్డు

వంట గదుల్లేకే..

జిల్లాలో సుమారు 900 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో కొన్ని పాఠశాలల్లోనే వంట గదులు ఉన్నాయి. గతంలో నిర్మించిన ఆ వంటగదులూ శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. అంతేకాకుండా ఆరు బయట వంట వండడంతో కట్టెల పొయ్యి నుంచి వచ్చే పొగతో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశాలున్నాయి. పొగ నేరుగా తరగతి గదుల్లోకి వ్యాపించి విద్యార్థుల చదువుపై ఏకాగ్రత కోల్పోవడంతో పాటు శ్వాస తీసుకోవడంలో కూడా (మిగతా 8లో..)

వంటగది లేక ఇబ్బందులు

• రాణి, హెచ్‌ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాన్సువాడ



బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వంట గది లేక ఇబ్బందులు ఉన్నది వాస్తవమే. త్వరలోనే పాఠశాలలో వంట గది నిర్మాణం చేసేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

క్రైం సమాచారం

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

దోమకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బ్రమయ్యగారి సౌమ్య(32) ఆరోగ్యం బాగలేదని ఇంట్లో దులానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై స్రవంతి శుక్రవారం తెలిపారు. సౌమ్యకు 2018లో వివాహమై 2019లో భార్యాభర్త మధ్య గొడవలు కావడంతో విడాకులు తీసుకొని దోమకొండలోని తన తల్లి గారింటి వద్దనే ఉంటుంది. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన చున్నీతో ఉరేసుకుంది. మృతురాలి తల్లి రాజమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

కోటగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ వద్ద గురువారం రాత్రి అదుపు తప్పి ఊక లారీ బోల్తా పడింది. కోటగిరి నుంచి మహారాష్ట్రలోని దెగ్లూర్ వైపు ఊకతో వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

దొంగల అరెస్టు

ముప్కాల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని హరిహర ఎలక్ట్రానిక్ షాపులో చోరీ నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బాల్కొండ సర్కిల్ ఆఫీస్‌లో ఎస్సై శైలేందర్‌తో కలిసి చోరీ వివరాలను వెల్లడించారు. ఈ నెల 18న యజమాని నిఖిల్ దుకాణానికి తాళం వేశారు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా.. వెనుక షెడ్డు ధ్వంసం చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం సేకరించిన వివరాలతో దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల ద్వారా ఇద్దరు నిందితులను సుంకెట్ తేజ, మీసాల అజయ్‌గా గుర్తించారు. నిందితులను పట్టుకొని విచారించగా చేసిన నేరం చేసినట్లు అంగీకరించారు. మెండోర మండలం సోన్‌పేట్‌కు చెందిన అజయ్, తేజ ద్విచక్రవాహనంపై వచ్చి టీవీలు, రైస్‌కుక్కర్‌లు, ఫ్యాన్‌లు, గ్రైండర్‌లతో కలిపి 11 వస్తువులను దోచుకెళ్లినట్లు చెప్పారు. చోరీకి ఉపయోగించిన బైక్‌ను సీజ్ చేసి దొంగిలించిన వస్తువులను రికవరీ చేశారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు. సుంకెట్ తేజ తరచూ దొంగతనాలు చేస్తాడని దర్యాప్తులో తేలిందని సీఐ తెలిపారు. గతంలో బాల్కొండ బైపాస్‌లోని ఈ కాం ఎంటర్‌ప్రైజెస్‌లో చోరీకి పాల్పడ్డాడన్నారు.

గంజాయి విక్రయదారులకు రిమాండ్

నిజామాబాద్ రూరల్, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాందేడ్‌లో గంజాయి కొని, రైలులో నిజామాబాద్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్న ఏడుగురు సభ్యుల ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు వివరాలను సీఐ వెల్లడించారు. ఈనెల 20న(గురువారం) మధ్యాహ్నం మోపాల్ మండలం కంజర శివారులో గంజాయి అమ్ముతున్నారన్న నమ్మదగిన సమాచారం మోపాల్ పోలీసులకు వచ్చింది. దాంతో ఎస్సై సుస్మిత తన బృందంతో తనిఖీలు నిర్వహించారు. కంజర శివారులో ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. అమీర్‌ఖాన్(21), షేక్ అఫ్రోజ్ (23), శివతేజ (20) ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా వారే గంజాయి అమ్ముతున్నామని అంగీకరించారు. వారిని విచారిస్తే నాందేడ్‌లో గంజాయి కిలో కొనుగోలుచేసి, దాన్ని నిజామాబాద్‌కు ట్రైన్‌లో తీసుకుని వచ్చినట్లు తెలిపారు. నాందేడ్‌లో గంజాయిని కొని నిజామాబాద్ తీసుకువచ్చి 5గ్రాముల చొప్పున కవర్లలో ప్యాక్‌చేసి రూ.200, రూ.300లకు విక్రయిస్తున్నట్లు వివరించారు. యువకులను టార్గెట్‌గా చేసుకుని విద్యార్థులకు, మైనర్లకు కూడా అమ్ముతున్నట్లు అంగీకరించారు. మోపాల్ పోలీసులు వీరి వద్ద ఉన్న 1.2 కిలోల గంజాయి, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మోపాల్ ఎస్ఐ స్వప్న బృందం నాందేడ్ వెళ్లి వీరికి గంజాయి విక్రయించిన షేక్ ఇమ్రాన్(21), మిర్జా జుబేర్‌బేగ్(26), అముల్ చౌరాసీ(19), షేక్ షేర్‌ఖాన్(27)ను అదుపులోకి తీసుకుని వారిని నిజామాబాద్ తీసుకువచ్చారు. వీరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలు

భిక్కనూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్సై అంజనేయులు శుక్రవారం తెలిపారు. మండలకేంద్రానికి చెందిన సత్తూరి వెంకటేశం డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడగా.. కామారెడ్డి సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ టీ.చంద్రశేఖర్ ఒక రోజు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారన్నారు.

ముప్కాల్: ముప్కాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి 4రోజుల జైలుశిక్ష విధించారని ఎస్సై రజనీకాంత్ శుక్రవారం తెలిపారు. ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామానికి చెందిన దాసరి చిన్న నర్సయ్యకు కౌన్సెలింగ్ ఇచ్చి.. కోర్టులో హాజరుపర్చగా ఆర్మూర్ కోర్టు మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారన్నారు.

ఇసుక నిల్వల స్వాధీనం

ఏర్గట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టాపూర్‌లో అక్రమంగా డంప్ చేసిన 14 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. గురువారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఇసుక డంప్‌లను గుర్తించి రెవెన్యూ అధికారులకు శుక్రవారం సమాచారం అందించారు. సీజ్ చేసిన ఇసుకను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా అందజేసినట్లు తహసీల్దార్ వెల్లడించారు.

ముప్కాల్ : బాల్కొండ మండలంలోని వన్నెల్ (బి) శివారులో వరద కాలువ నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న జేసీబీ, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై శైలేందర్ శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి వరద కాలువ నుంచి మొరం తరలిస్తున్నట్లు సమాచారం మేరకు వాహనాలను పట్టుకొని సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగించామన్నారు.





గల్లీలో.. కుక్కలు ఇళ్లలోకి.. కోతులు

- ఆర్మూర్‌లో తీవ్రమైన సమస్య
- తరచూ ప్రజలపై దాడులు
- పట్టించుకోని అధికారులు

ఇంట్లోని వస్తువులు బయటపెట్టాలన్నా.. ఇంట్లో నుంచి అడుగు బయటకు వేయాలన్నా ప్రజలు జంకే పరిస్థితి నెలకొంది. బడికి బయలుదేరిన పిల్లలు, పనికి వెళ్లిన పెద్దలు, దుకాణాలకు వెళ్లే వృద్ధులు ఎలా తిరిగొస్తారోననే భయం ఆర్మూర్ డివిజన్‌లో నెలకొంది. ఇంట్లో ఉంటే కోతుల బెడద.. బయటకొస్తే కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టింపు లేకుండా ఉందని వాపోతున్నారు. - ఆర్మూర్ టౌన్

మచ్చుకు కొన్ని ఘటనలు..

మూడేళ్ల కిందట పెద్దబజార్‌కు చెందిన చిన్నారికి కుక్క కరిస్తే చందాలు పోగుచేసి హైదరాబాద్‌లో చికిత్స చేయించగా ప్రాణపాయం తప్పింది. ఇటీవల బాల్కొండకు చెందిన ఓ చిన్నారి కుక్కకాటుకు గురై లక్షణాలతో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది.ఆర్మూర్‌లోని సిద్ధుల గుట్ట ప్రాంతంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల భవనానికి జాలీలలు లేక కోతులు తరగతి గదుల్లోకి వెళ్తున్నాయి.సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పక్కనున్న ఇంటర్ బాలికల కళాశాలతో పాటు, బాలికల వసతి గృహ విద్యార్థినులు కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నాయి.

గతంలో చర్యలు..

గతంలో మునిసిపల్ పరిధిలోని కుక్కలను కొంత మేర జిల్లాకేంద్రంలోని ఏబీసీ సెంటర్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించగా.. మరికొన్ని అలాగే మిగిలిపోయాయి. గల్లీలో తిరిగే కుక్కలకు పచ్చి మాంసం దొరకడంతో వాటిని తిని రోగాల బారిన పడి వేరే వాటికి వ్యాధిని అంటిస్తున్నాయి.

కుక్కల నియంత్రణకు చర్యలు చేపడతాం..

మునిసిపల్ పరిధిలో కొన్ని కుక్కలను పట్టుకొని ఏబీసీ సెంటర్‌కు తరలించి, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాం. ఇప్పటికి సమస్య ఉందని మా దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.
- రాజు, మునిసిపల్ కమిషనర్

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ఆర్మూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెర్కిట్‌లోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ(మల్టీపర్పస్, హెల్త్‌వర్కర్ మహిళలు) రెండేళ్ల ఉచిత నర్సింగ్ శిక్షణ(డేస్కాలర్)కు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రాంగణం అధికారి, జిల్లా మేనేజర్ పి.ఇంద్ర సూచించారు. 18-35 ఏళ్ల మహిళలు, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ తెలంగాణ హైదరాబాద్ పేరిట రూ.200 రిజిస్ట్రేషన్ రుసుంతో డీడీ తీసి ఆన్‌లైన్ దరఖాస్తు పత్రానికి జత చేయాలన్నారు. వాటిని ఈనెల 25వ తేదీలోపు పెర్కిట్‌లోని మహిళా ప్రాంగణంలో అందజేయాలన్నారు. దరఖాస్తుదారులు 10వ తరగతి, ఇంటర్ మెమోలు, ఆధార్‌కార్డు, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు, తెల్ల రేషన్ కార్డు, ప్రభుత్వ వైద్యుడు ధ్రువీకరించిన ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, 4-10వ తరగతి వరకు బోనఫైడ్ సర్టిఫికెట్, 6పాస్‌పోర్టు ఫొటోలతో దరఖాస్తు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 7660022520, 8790200180, 7660022591 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత కంటి వైద్యశిబిరం

రుద్రూరు,నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సులేమాన్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాకాసిపేట్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణుడు సతీష్ 54 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 17మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించారు. వారిని ఆపరేషన్ నిమిత్తం బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రికి రెఫర్ చేశారు. అవసరమైన రోగులకు కంటి చుక్కల మందులు, నొప్పుల మాత్రలను ఉచితంగా అందజేశారు. ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కేవీ మోహన్, జిల్లా చైర్మన్ శ్యామ్ సుందర్ పహాడే, కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, సభ్యులు సాగర్, మల్లేష్, క్యాంప్ ఇన్‌చార్జి హన్మంత్ రావు, మాజీ సర్పంచ్ షేక్ ఖాదర్, లింగంగౌడ్ ఉన్నారు.



ఫకీరాబాద్‌లో సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై తిరుపతి

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

నవీపేట,నవంబరు21(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి మాట్లాడుతూ.. ప్రధాన రహదారికి ఇరువైపులా, గ్రామంలోని పలు కూడళ్లలో సీసీ కెమెరాలను వ్యాపారస్థులు, గ్రామస్థులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు ఉంటే ఎలాంటి ఘటనలు జరిగినా నేరస్థులను సులువుగా పట్టుకోవచ్చన్నారు. వారంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటామని గ్రామస్థులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్సై మోహన్‌రెడ్డి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.



సుంకినిలో నిరసన తెలుపుతున్న రైతులు

కొనుగోలు చేసిన సోయాను తరలించాలి

కోటగిరి,నవంబరు21(ఆంధ్రజ్యోతి): తూకం వేసిన సోయా పంటను తరలించాలని రైతులు పోతంగల్ మండలంలోని సుంకినిలో శుక్రవారం నిరసన తెలిపారు. పోతంగల్ సొసైటీ ఆధ్వర్యంలో 20రోజుల క్రితం సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభించారని.. ఇపక్కటి వరకు 8 లారీల పంటను కొనుగోలు చేసినా కేవలం ఒకే లారీని మార్క్‌ఫెడ్‌కు తరలించారని పేర్కొన్నారు. మిగిలిన సోయా తూకం వేసిన చోటే ఉండిపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో దళారులకు అమ్ముకోవాల్సి వచ్చిందని ఇప్పడేమో ఇలా ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. పడిగాపులు కాయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు సమస్యపై దృష్టి సారించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు దిగంబర్‌పటేల్, గంగారాం, పోశెట్టి, శంకర్, లాలయ్య పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలను శాంతియుతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై కే.సందీప్

భీమ్‌గల్ రూరల్ , నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించడానికి ప్రజలు సహకరించాలని ఎస్సై కే.సందీప్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మెండోరా, బాబానగర్‌లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ సదుపాయాలు, తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఓటు చాలా విలువైనదని, ప్రలోభాలకు గురిచేసి ఓటు వేయాలని బెదిరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

జక్రాన్‌పల్లి: స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రజలు కృషి చేయాలని ఎస్సై జి.మహేష్ పేర్కొన్నారు. శుక్రవారం చింతలూర్‌లో పోలింగ్ కేంద్రాలను ఎస్సై స్థానిక అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. స్థానిక రాజకీయ పరిస్థితులు ఎన్నికల సమయంలో ఏర్పడే సమస్యల వంటి అంశాలపై గ్రామస్థులతో సమావేశమై వివరాలు సేకరించారు. గ్రామాల్లో ఏవైనా ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్సై జి.మహేష్

ఘనంగా పోచమ్మ ఊరేగింపు

బోధన్,నవంబరు21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 16వ వార్డులో పెద్ద పోచమ్మ ఊరేగింపును శుక్రవారం ప్రారంభించారు. 16వ వార్డులో పునర్ నిర్మాణం చేసిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించినట్లు మహలక్ష్మి ట్రస్ట్ పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణం నుంచి మహలక్ష్మి ఆలయం నుంచి పెద్ద పోచమ్మ అమ్మవారి ఆలయం వరకు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో అమ్మవారి విగ్రహానికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మహలక్ష్మి ట్రస్ట్, పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యులు బీర్కూర్ బుజ్జి, గుండెటి శంకర్‌లతో పట్టణ ప్రముఖులు తదితరులున్నారు.



పెద్ద పోచమ్మ ఊరేగింపులో పాల్గొన్న బోధన్ పట్టణ పెద్దలు

నమ్మించి.. బంగారు నగలు కాజేసి

నిజామాబాద్ సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మాటలతో దగ్గర చేసుకుని, వాళ్లను నమ్మించి నగలు కాజేసింది ఓ మహిళ. ఈ ఘటన నగరంలోని ఒకటవ టౌన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ రఘుపతి కథనం ప్రకారం.. నగరంలోని కుమార్‌గల్లికి చెందిన గంగాకిషన్ తన ఇంటి కింద ఓ బ్యూటీ పార్లర్ నిర్వాహణకు ఇంటిని అద్దెకు ఇచ్చాడు. బ్యూటీపార్లర్‌లో పనిచేస్తున్న గాయత్రి పైఅంతస్తులోని యజమానులతో స్నేహం కుదుర్చుకుంది.నమ్మకంతో ఇంట్లోకి రానిచ్చిన ఆ ఇంటి వాళ్లకు చెందిన సుమారు 18 తులాల బంగారు, కిలో పావు వెండి, కొంత నగదును ఈ నెల 13న కాజేసినట్లు యజమాని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

హైకోర్టు తీర్పుతో సొసైటీ చైర్మన్ల బాధ్యతల స్వీకరణ

మెండోర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు తీర్పుతో సావెల్ సొసైటీ చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి, పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మచ్చర్ల రాజారెడ్డి మాట్లాడుతూ.. రైతులకు తిరిగి సేవ చేసే అవకాశం కలిగినందుకు అదృష్టంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, సెక్రెటరీ సురేందర్ పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలంలోని తాళ్లరాంపూర్, ఏర్గట్ల ప్రాథమిక వ్యవసాయ కేంద్రాల్లో శుక్రవారం కోర్టు ఉత్తర్వుతో జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు చైర్మన్‌లు పాలకవర్గం సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. తాళ్లరాంపూర్‌లో పెద్ద కాపుల శ్రీనివాస్ రెడ్డి, ఏర్గట్లలో బర్మ చిన్న నర్సయ్య చైర్మన్‌లుగా బాధ్యతలు స్వీకరించగా వారితో పాటు పాలకవర్గం డైరెక్టర్‌లు బాధ్యతలు చేపట్టారు.



తాళ్లరాంపూర్‌లో బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గ సభ్యులు



బాధ్యతలు తీసుకుంటున్న అశోక్‌రెడి

మోర్తాడ్ పీఏసీఎస్ చైర్మన్‌గా అశోక్‌రెడ్డి

మోర్తాడ్: మండల కేంద్రంలోని పీఏసీఎస్ చైర్మన్‌గా బద్దం అశోక్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆయన మళ్లీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి కాశీరాం పాల్గొన్నారు.

చిచ్చరపిడుగులు

- క్రీడల్లో సత్తా చాటుతున్న విద్యార్థులు
- జిల్లాస్థాయిలో ప్రతిభ
- రాష్ట్రస్థాయికి ఎంపిక

బాలలు.. దేశానికి విలువైన సంపద. వారు మంచి పౌరులుగానే ఎదగడమే కాదు.. క్రీడాకారులుగా మంచి పేరు తీసుకొస్తారు. గ్రామస్థాయిలో సర్కారు బడుల్లో చదివే చిన్నారులు క్రీడల్లో రాణిస్తూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతూ తమదైన ముద్రను వేసుకుంటున్నారు. అలాంటి వారిని చూస్తే మట్టి మాణిక్యాలు వెలుగులోకి వస్తున్నారంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్లు

ఆర్మూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మినీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీలకు హాకీ బాలబాలికల జిల్లా జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. అందులో నుంచి ప్రతిభ చూపిన 18మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి రమణ తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు స్వప్న, నాగేష్, చిన్నయ్య, స్వామి, రాజేశ్వర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆర్మూర్: మండలంలోని పిప్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మేఘన, నవదీప్ రాష్ట్రస్థాయి అండర్ 17 ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నవీన్‌కుమార్, పీఈటీ గంగారెడ్డి తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి భువనగిరి జిల్లాలో జరుగనున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారన్నారు.

మామిడిపల్లి విద్యార్థుల ఎంపిక..

ఆర్మూర్ మునిసిపల్ పరిధిలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మనోజ్ఞ, పల్లవి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రవీందర్, పీఈటీ రాజేశ్వర్ తెలిపారు. ఇటీవల జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యార న్నారు.

క్రికెట్ పోటీలకు వాసు..



వాసును అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆర్మూర్‌లోని మోడల్ స్కూల్ విద్యార్థి వాసు ఎస్‌జీఎఫ్ అండర్ 19 రాష్ట్రస్థా యి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఏవీఆర్ శ్యాం, పీడీ గంగదాస్ తెలిపారు. సారంగపూర్ హై స్కూల్‌లో నిర్వహించిన ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వాసు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 23 నుంచి సైనిక్‌పురిలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

ఖోఖోలో వాగ్దేవి ప్రతిభ..



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన వాగ్దేవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వేల్పూర్ : పచ్చలనడ్కుడ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.వాగ్దేవి రాష్ట్రస్థాయి ఖోఖో పపోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రమేష్, పీడీ గంగాదర్ తెలిపారు. ఇటీవల కామారెడ్డిలో ఉమ్మడి జిల్లా అండర్17 విభాగంలో నిర్వహించిన ఖోఖో పోటీలలో వాగ్దేవి ప్రతిభ కనబర్చి నిజామాబాద్ జట్టు తరపున రాష్ట్రస్థాయిలో జరిగే టోర్నీకి ఎంపికైందన్నారు. ఈ నెల 23 నుంచి భువనగిరి జిల్లాలో జరిగే పోటీల్లో వాగ్దేవి ఆడునుందన్నారు. వాగ్దేవిని హెచ్‌ఎం రమేష్, పీడీ గంగాధర్, ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షిప్త సమాచారం

షెడ్లకు భూమిపూజ

మోర్తాడ్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకెట్‌లో శుక్రవారం పశువుల షెడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్యాల సునీల్‌కుమార్, ఏపీవో శకుంతల భూమిపూజ చేశారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాములు, ఏఎంసీ డైరెక్టర్ మహిపాల్, నాయకులు అశోక్, ఆనంద్, రఘుపతిరెడ్డి, నర్సింహరెడ్డి, గంగాధర్, సాయి రెడ్డి, రాజేష్, మల్లేష్, రమేష్, వెంకట్, టెక్నికల్ అసిస్టెంట్‌లు స్రవంతి పాల్గొన్నారు.

పన్నులు చెల్లించాలి

బోధన్,నవంబరు21(ఆంధ్రజ్యోతి): పన్నులు చెల్లించి ప్రతి ఒక్కరు పట్టణ అభివృద్ధికి సహకరించాలని మునిసిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలో పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని వ్యాపారులు, ఇంటి యాజమానులు సకాలంలో మునిసిపాలిటీ పన్నులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జక్రాన్‌పల్లి , నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలిగోట్‌లో శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు ఐదుగురు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగా.దర్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు గంగా ధర్, సంతోష్, పాల్గొన్నారు.

డీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

భీమ్‌గల్ , నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డీటీఎఫ్ మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. పట్టణ కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో జిల్లాధ్యక్షుడు బాలయ్య అధ్యక్షతన మండల అధ్యక్షుడిగా జాన్‌విల్సన్, ప్రధాన కార్యదర్శిగా గట్టు ఈశ్వర్, ఉపాధ్యక్షురాలిగా సంగీత, కార్యదర్శిగా రమేష్, కోశాధికారి శ్రావణ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని నూతనంగా ఎన్నికైన వారు తెలిపారు.

రూ.50లక్షల పరిహారం అందించాలి

నవీపేట,నవంబరు21(ఆంధ్రజ్యోతి): ఇటీవల రంగారెడ్డి జిల్లా ఫారుక్ నగర్ మండలం ఏంపల్లిలో హత్యకు గురైన దళితుడు చంద్రశేఖర్ కుటుంబానికి 50లక్షల రూపాయల పరిహారం అందించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన నవీపేటలో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. రాష్ట్రంలో కుల దురాహంకార హత్యలు పెరిగిపోయాయని, నిందితులను శిక్షించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కన్వీనర్ గౌతం, గంగాధర్, లింబాద్రి, సాయిలు, భుజందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న గ్రామస్థులు

ఆర్థిక సాయం అందజేత

ఆర్మూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం చేపూర్‌కు చెందిన చిందు కళాకారుడి కుటుంబానికి శుక్రవారం గ్రామస్థులు రూ.51వేల ఆర్థికసాయం అందజేశారు. చిందు కళాకారుడు చిందుల ఈశ్వర్ కుమారుడు రాజు ఇటీవల అకాల మరణం చెందారు. వారిది పేద కుటుంబం కావడంతో ఆదుకునేందుకు గ్రామానికి చెందిన ఉద్యోగులు, యువకులు, ఎన్‌ఆర్‌ఐలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శాంతికుమార్, రాజేశ్వర్, రంజిత్, కార్తీక్, రవికిరణ్, సుధీర్, హరీష్, అఖిల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని అభంగపట్నంలో సతీష్‌కు చెందిన బార్బర్ షాప్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. సతీష్ కుమార్తె యోగిత జడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతుంది. విద్యార్థిని తండ్రి ఉపాధి కోల్పోయాడని తెలుసుకొని ఉపాధ్యాయులు రూ.4వేలను సతీష్‌కు అందజేశారు. హెచ్‌ఎం మల్లేష్, ఉపాధ్యాయులు కోటేశ్వర్‌రావు, రాజేంద్ర ప్రసాద్, రవీందర్ రెడ్డి, అనిల్, సంజీవ్, గోపికళ, వాసంతి ఉన్నారు.

పంట నూర్పిడికి కూలీల కొరత

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు లేక బోరుబావుల్లో నీటి సౌకర్యం ఉన్న రైతులు మాత్రమే పంటలు వేశారు. ఆగస్టు చివరివారం నుంచి భారీ వర్షాలకు కుంటు, చెరువులు నిండడంతో వాటి గట్టున ఉన్న రైతులు ఆలస్యం పంటలు వేశారు. ప్రస్తుతం పంట చేతికొచ్చే దశలో యంత్రాలు, కూలీల కొరతతో పంట నూర్పిడి కష్టమైంది. కోతలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

- ఆలస్యంగా చేతికొచ్చిన పంట
- పెద్దకొడప్‌గల్‌లో కోతలకు ఇబ్బందులు
- రైతన్నకు భారం



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలు

పెద్దకొడప్‌గల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌సీజన్‌లో నియోజకవర్గంలోని ఆయా మండలాల పరిధిలో రైతన్నలు వరిపంటను సాగు చేశారు. ప్రారంభంలో సరిగ్గా వర్షాలు కురియకపోవడంతో రైతన్నలు కేవలం వ్యవసాయ బోరుబావుల దగ్గర మాత్రమే వరి పం టను సాగు చేశారు. ఇక ఆగష్టు చివరి వారం నుంచి భారీవర్షాలు కురియడంతో చెరువులు, కుంటలు, వాగులలో భారీగా నీరు చేరింది. దీంతో రైతన్నలు ఆశతో చెరువులు, కుంటలు, వాగులను ఆధారంగా చేసుకుని వరిపంటను సాగుచేశారు. వ్యవసాయ బోరుబావుల దగ్గర సాగు చేసిన వరి పంట గతంలోనే చేతికి రాగా, ప్రస్తుతం ఆలస్యంగా సాగుచేసిన వరిపంట చేతికి వచ్చింది. దీంతో పంట నూర్పిడి చేయడానికి గాను రైతన్నలకు కూలీల కొరత ఏర్పడింది. ఇప్పటికే వ్యవసాయ కూలీలు ఆయా పనులలో నిమగ్నం కావడంతో పంట నూర్పిడిలకు కొరత ఏర్పడింది. దీంతో వరిపంట సాగు చేసిన రైతన్నలకు పంట కోతలు కోయడం తలకు మిం చిన భారంగా మారిందని పలువురు వాపోతున్నారు. గతంలో సీజన్ ముందుగా ప్రారంభం కావడంతో తొం దరగా పంట చేతికి వచ్చేదని, ప్రస్తుతం పంటను ఆలస్యంగా సాగుచేయడంతో కోతలు ఆలస్యంగా వస్తున్నాయని రైతన్నలు తెలిపారు.

అమాంతం ధర పెంచేసిన యజమానులు...

నియోజకవర్గంలో వరిపంటను కోతలు కోసేందుకు రైతన్నలు చేతి కటింగ్‌తో పాటు హార్వేస్టర్‌లను వినియోగిస్తుంటారు. ఈ ప్రాంతంలో వరిపంటను కోతలు చేసేందుకు గాను ప్రతి సీజన్‌లో కర్నాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి హార్వేస్టర్లు వచ్చేవి. ఆనవాయితీ ప్రకారం ఈ సీజన్‌కు కూడా అక్కడి నుంచి కోత మిష న్లు వచ్చాయి. అయితే మన ప్రాంతంలో వరి పంట చేతికి ఆలస్యంగా రావడంతో పాటు, భారీగా వర్షాలు కురిశాయి. దీంతో కర్నాటక, ఆంధ్ర ప్రాంతాలకు చెం దిన హార్వేస్టర్లు అక్కడ కూడా ఇదే సమయంలో పంట చేతికి రావడంతో హార్వేస్టర్లు తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లిపోయాయి. దీంతో అంతో ఇంతో ఉన్న హార్వేస్టరు యజమానులు తమ రేటును పెంచేశారు. చైన్‌మిషన్ ఎకరా వరి పంటను కోత కోసేందుకు ప్రారంభంలో గం టకు 2600 రూపాయలు తీసుకోగా, ప్రస్తుతం గంటకు 32 వందల చొప్పున వసూలు చేస్తున్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురి డిబార్


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సుభాష్‌నగర్, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ పరీక్షల్లో నలుగురు డిబార్ అయినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్ తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలో ఉదయం జరిగిన పరీక్షల్లో 1270 మంది విద్యార్థులు ఉండగా 1168 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. 101 మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 4861 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 4693 మంది విద్యార్థులు హాజరై 165 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడిన నలుగురు విద్యార్థులు డిబార్ అయినట్లు తెలిపారు. సీఎస్ఐ కళాశాలలో ఇద్దరు, గిరిరాజ్ గవర్నమెంట్ కళాశాలలో ఒకరు, మంజీర డిగ్రీ కళాశాలలో ఒకరిని డిబార్ చేసినట్లు తెలిపారు. తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ ఇంటిగ్రేటెడ్ పరీక్షల పునఃర్మూల్యాంకనం కోసం దరఖాస్తు పత్రాలను ఈనెల 29న సమర్పించాలని కంట్రోలర్ ఆచార్య కే.సంపత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీయూ పరిధిలోని 20-25 బ్యాచ్ ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సు ఏపీఈ, పీసీహెచ్, ఎంబీఏ కోర్సుల 2వ, 4వ సెమిస్టర్, రెగ్యులర్ థియరీ పరీక్షల ఫలితాల మూల్యాంకణం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పునఃర్మూల్యాంకనం ఫీజు 500ల రూపాయలతో పాటు 25 రూపాయలు చెల్లించి దరఖాస్తు పత్రాలు పొందాలని పరీక్షల నియంత్రణ అధికారి తెలిపారు. పూర్తి వివరాలు టీయూ వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు.

సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు

కామారెడ్డి రూరల్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్లూర్‌గ్రామ శివారులో గల ఇల్చిపూర్‌లో గల సరస్వతీ దేవి ఆలయంలో మార్గశిర మాసం పురస్కరించుకొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూజరులు దత్తాద్రి పంతులు తెలిపారు. శుక్రవారం అమ్మవారికి పర్వదినం కావడంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ వారికి కుంకుమార్చనలు, హారతి, చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం వంటి పూజా కార్యక్రమాలను అంగరంగవైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మ వారికి భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

కల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు

బాన్సువాడటౌన్ , నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఈనెల 26న నిర్వహించబోయే శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణమహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్షపల్లి సాయిరెడ్డి భక్తులను కోరారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు చీకోటి ప్రవీణ్‌లు విచ్చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గురుస్వాములు ర్యాల విఠల్‌రెడ్డి, తాటి ప్రశాంత్, సిద్ది మహేశ్, శ్రీధర్ , శంకర్‌గౌడ్, సంజీవ్‌కుమార్, సుధాకర్, కిరణ్, ప్రణయ్, మధు, భాస్కర్ రెడ్డి తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం


మిత్రుడి కుటుంబానికి ఆర్థికసహాయం అందజేస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్ , నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తమతోటి మిత్రుడు మరణించడంతో కుటుంబసభ్యులకు బాసటగా నిలిచారు పూర్వవిద్యార్థులు. పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ కొనబాన్సువాడ పాఠశాలకు చెందిన 2003-04 పదోతరగతి విద్యార్థుల్లో ఒకరైన డోంగ్లీ మండలం టాక్లి గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ గతవారం అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా శుక్రవారం పూర్వవిద్యార్థులు మిత్రుని కుటుంబసభ్యులను పరామర్శించి రూ.30 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఫహీంఅజ్మత్, రాజు, నరేశ్‌గౌడ్, ఎన్.రాజు తదితరలున్నారు.

పంటసాగుకు కొత్త పద్ధతి


స్ప్రిన్కర్ నీరుతో పంటలు సాగు చేస్తున్న రైతులు

జుక్కల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్ గ్రామం వద్ద మొక్కజొన్నపంటకు రైతులు స్ప్రిన్కర్ వాటర్‌తో పంటలు సాగుచేస్తున్నారు. చలికాలంలో పంట పుష్కలంగా ఎదగడానికి రైతులు పంటలకు నీరు పొదుపుగా వాడి స్ప్రిన్కర్ వాటర్‌తో సాగుచేస్తున్నారు. ఎకరం పంట నీరు పెట్టడానికి స్ప్రిన్కర్ ద్వారా ఒక్కరోజులో భూమి తడుస్తుంది. స్ప్రిన్కర్ లేకుండా లూజ్‌పైప్ ద్వారా భూమి తడపడానికి మూడు రోజులు సమయం తీసుకుంటుందని రైతులు పేర్కొన్నారు. స్ప్రిన్కర్ వాటర్‌తో నీరు వర్షం కురిసిన మాదిరిగా పంటకు అవసరమున్నంత నీళ్లు పెట్టుకోవచ్చని రైతులు అన్నారు. విద్యుత్తు కోతలు పంటలు సాగుచేయడానికి స్ప్రిన్కర్ వాటర్ మంచి పద్ధతి అని రైతులు పేర్కొన్నారు.

నాసిరకంపై చర్యలు తీసుకోండి


ర్యాలీగా వస్తున్న విద్యార్థులు

- యూనివర్సిటీలో విద్యార్థుల ర్యాలీ, నిరసన
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

సుభాష్‌నగర్, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి) : యూనివర్సిటీ వసతిగృహంలో నాసిరకం వస్తువులు సరఫరా చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న వారిపై కఠిన చర్య లు తీసుకోవాలని విద్యార్థులు డిమాం డ్ చేశారు. వందలాది మంది విద్యార్థులు శుక్రవారం వసతి గృహం నుం చి అడ్మిన్ కార్యాల యం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం ఓల్డ్ బాయ్స్ మెస్‌లో నాసిరకమైన వస్తువులు దొరికాయని, ఇప్ప టివరకు విచారణ రిపోర్ట్ బయటపెట్టకుండ బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదన్నా రు. సరుకులు సరఫరా చేసేవారిపై కేసు నమోదు చేయాలని, విద్యార్థులపై బారం వేసిన 2 నెలల మెస్ బిల్లులు పూర్తిగా రద్దుచేయాలన్నారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా చేస్తున్న విద్యార్థుల వద్దకు పరీక్షల విభాగ అధినేత సంపత్ చేరుకుని రిజిస్ట్రార్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. త్వరలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

● డీఏవో మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న డీఏవో

బాన్సువాడరూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని తాడ్కోలు రైతువేదికలో శుక్రవారంయాసంగి సీజన్ నేపథ్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో సొసైటీ కార్యదర్శులు, ఫర్టిలైజర్ దుకాణదారులకు, ఏఈవోలకు యాసంగి పంటల ప్రణాళికపై మార్గదర్శకాలు అందజేశారు. సహకార సంఘాల కార్యదర్శులు ఎరువులు, పురుగు మందుల దుకాణాల యజమానులు బాధ్యతగా వ్యవహరించాలని, రైతులకు తప్పనిసరిగా ఎరువులు, విత్తనాలకు సంబంధించి రశీదు ఇవ్వాలన్నారు. యూరియా సరఫరా విషయంలో అలసత్వం వహించరాదని, మండలానికి చెందిన రైతులకు సరిపడా అందించాలన్నారు. నకిలీ పురుగుమందుల వాడకం పట్ల హెచ్చరికలు జారీ చేస్తూ నాణ్యమైన రసాయనాల వినియోగం మాత్రమే కొనసాగించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏడీఏ అరుణ, ఏవోలు ఫయాజుల్లా, భవానీ, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, కార్యదర్శులు, ఫర్టిలైజర్ దుకాణదారులు, ఏఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఉజ్వల భవిష్యత్తు

- ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

సదాశివనగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపకార వేతనంతో పాటుగా ఉజ్వల భవిషత్తు ప్రభుత్వ కళాశాలలో అందుతుందని సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సింగం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వివిధ పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ సౌకర్యాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోని ఇంటర్ మొదటి సంవత్సరం ప్రభుత్వ కళాశాలలో చేరాలన్నారు. కళాశాలలో ఉచిత అడ్మిషన్, ఉచిత పాఠ్య పుస్తకాలు, నాణ్యమైన విద్యాబోధన, అనుభవజ్ఞులైనా అధ్యాపకులు, విశాలమైన సొంత భవనాలు, నీట్, ఐఐటీ మెయిన్స్ తదితర కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మంచి ఉత్తీర్ణత, వెనుక బడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి, సాయంత్రం స్టడీ అవర్, శనివారం క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సింగం శ్రీనివాస్

వరిధాన్యం పరిశీలన

దోమకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో శుక్రవారం ఏఈవో నవీన్‌కుమార్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని క్యాలిబార్ మిషన్‌తో ధాన్యం గింజ సైజు దొడ్డు, సన్న రకాలను ఏఈవో పరిశీలించారు. సన్నరకం ధాన్యాన్ని వేరుగా కాంటా చేయాలని సెంటర్ ఇన్‌చార్జ్ రాజుకు ఏఈవో నవీన్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలి

భిక్కనూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలని భిక్కనూరు మండల విద్యాధికారి రాజ్‌గంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దమల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్ఎం ప్రసూన దేవి ఆధ్వర్యంలో కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఎంఈవో హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సరైనా విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ ఈశ్వర్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

● సీడీపీవో కళావతి


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో

మద్నూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్లు, వర్కర్లు సమయపాలన పాటించాలని, చిన్నారులకు అందుబాటులో ఉండాలని మద్నూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని కళావతి సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తుందని, వాటిని సకాలంలో అందజేయాలని తెలిపారు. ప్రతినెల 1వ తేదీన అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారుల బరువు ఎత్తు పరీక్షించాలని, అతి తక్కువ బరువు ఉన్నట్లు గుర్తించిన పిల్లలను సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించాలని సూచించారు. 15 రోజులకోసారి పిల్లలకు నెలకొకసారి ఎత్తు బరువు చూడాలని అన్నారు. గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లు, సకాలంలో అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా మండలాల సూపర్వైజర్లు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం ఎప్పుడో ?

- భవనం పూర్తయి మూడునెలలైనా ప్రారంభించని అధికారులు
- నసురుల్లాబాద్‌లో ప్రజలకు ఇబ్బందులు


ప్రారంభానికి నోచుకోని నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నసురుల్లాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నసుల్లాబాద్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం ఎప్పుడు జరుగుతుందోనని మండల ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. భవనాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేశారు. భవనం పూర్తయి సుమారు మూడునెలల కాలం గడుస్తున్నా సేవలకు మాత్రం నోచుకోవడం లేదు. అప్పుడప్పుడు అధికారులు వచ్చి భవనాన్ని చూసి వెళ్తున్నారు. కానీ సిబ్బందిని కేటాయించి ప్రజలకు సేవా కార్యక్రమాలు అందించేలా చర్యలు తీసుకోవడం లేదు. ప్రజలకు వైద్య సేవలను అం దించడం కోసం నాయకుల ఒత్తిడితో సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేశాడు. అయితే గోడలకు స్లాబుకు సరిగ్గా క్యూరింగ్ జరగకపోవడంతో అవి ఇప్పటికే బీటలు వారుతున్నాయని స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించాలని సదుద్దేశంతో పనులు చేపట్టినా కూడా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆరోగ్య కేంద్రం మాత్రం ప్రారంభం అవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనాన్ని ప్రారంభించి, మండల ప్రజలకు వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

బీర్కూర్‌లో ఘనంగా అయ్యప్ప పడిపూజ


బీర్కూర్‌లో అయ్యప్ప పడిపూజ చేస్తున్న దృశ్యం

బీర్కూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అయ్యప్ప మహాపడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించా రు. గ్రామానికి చెందిన మియ్యాపురం సూర్యప్రకాష్ ఇంటి వద్ద అంగరంగ వైభవంగా పడిపూజ మహోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో మార్మోగింది. ఈ మహపడిపూజ మహోత్సవానికి పెద్దఎత్తున అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొని అయ్యప్ప నామస్మరణం, భజన పాటలు, భక్తి గీతాలను ఆలపించారు.

మత్తుపదార్థాలకు బానిస కావద్దు

- కళాబృందం ప్రదర్శన

పిట్లం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని పోలీస్ కళాబృందం పాఠశాలలో విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కామారెడ్డి పోలీస్ కళాబృందం చెడు అలవాట్లపై చక్కని పాటల రూపంలో విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్పీ రాజేష్ చంద్ర గారి ఆదేశాల మేరకు పోలీసుకళాబృందంతో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కళాబృందం సభ్యులు మాట్లాడుతూ డ్రగ్స్ గంజాయి మాదకద్రవ్యాలు సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్‌అండ్‌డ్రైవ్ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, నేరాలు, సెల్‌ఫోన్ ప్రభావం ఆయా అంశాలపై వివరించారు. కార్యక్రమంలో పోలీసు కళాబృందం ఇన్‌చార్జి హెడ్‌కానిస్టేబుల్ రామంచ తిరుపతి, కేశవరావు, పీసీఎస్, ప్రభాకర్, సాయిలు, పిట్లం ఏఎస్ఐ రహప్ప, హెడ్‌కానిస్టేబుల్ సాయగౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాబృందం



కాశీ విశ్వనాథ శివలింగం ప్రతిష్ఠాపన చేస్తున్న దృశ్యం

కాశీ విశ్వనాథ శివలింగం ప్రతిష్ఠాపన

కామారెడ్డి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో గల పురాతనమైన భక్తాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం కాశీ విశ్వనాథ శివలింగం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అవరణలో వేద పండితులైన బ్రహ్మశ్రీ గంగవరం ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో కాశీ విశ్వనాథ శివలింగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం శివలింగానికి పండితులు ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఆంజనేయ స్వామి, శివలింగాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో జగదీష్ గుప్తా, దేవేంద్రచారి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కల్యాణలక్ష్మీ, షాదీముబారాక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు 22 కల్యాణ లక్ష్మీ, 8 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు సల్మాన్, జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు వినోద్, మండల సీనియర్ నాయకులు బాల్‌రాజ్, సంజీవ రెడ్డి, సహదేవ్, భీమరి శ్యామయ్య, స్వామి యాదవ్ పాల్గొన్నారు.

దుప్పట్లు, స్వెటర్లు అందజేత



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం వర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐదు అత్యంత నిరుపేద కుటుంబాలకు దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం రాంనారాయణగౌడ్ మాట్లాడుతూ చలికాలం సందర్భంగా మండలంలోని ఆయాగ్రామాల్లో ఉన్న అత్యంత నిరుపేద కుటుంబాలను గుర్తిస్తే సంస్థ ప్రతినిధులు స్వెటర్లు, దుప్పట్లు అందించామన్నారు. వారి ప్రేరణతో మండల సమాఖ్య ప్రతినిధులు ఒక్కొక్కరు వారికి తోచిన సహాయాన్ని ఇచ్చారని, విరాళంగా సేకరించిన వాటితో పేదవారికి దుప్పట్లు, స్వెటర్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, సమాఖ్య అధ్యక్షురాలు పావని, సిబ్బంది, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

పాల్వంచ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌మీటర్ వద్ద షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి ఇల్లు దగ్ధమైన ఘటన పాల్వంచ మండలం భవానీపేట్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కర్రోల్ల రేణుక పనినిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. విద్యుత్ మీటర్ వద్ద షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వచ్చి ఇల్లు దగ్ధం కావడంతో ఇంటిలోని సామాగ్రి మంటల్లో కాలిపోయాయి. ఇల్లు, సామాగ్రి కాలిపోయిన తనకు ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరింది.

లింగంపేటలో హెల్త్ క్యాంప్

లింగంపేట, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశాల మేరకు నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులతో మేగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. మొత్తం 250మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, మొకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, దగ్గు, దమ్ము, జ్వరంతో పాటు ఇతర వ్యాదులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాదులతో బాధపడుతన్న వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించి, ఉచితంగా ఆపరేషన్లు చేసేందుకు 40మందిని హైదరాబాద్‌కు రిఫర్ చేసినట్లు కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు నారాగౌడ్ తెలిపారు. 40మందికి ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేశామని వారికి హైదరాబాద్‌కు ఉచితంగా రవాణతో పాటు పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్లు చేసి తిరిగి ఇంటివద్దకు తీసుకువస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, అబ్దుల్ వాహబ్, శంకర్‌గౌడ్, సాయికుమార్, ప్రసాద్‌గౌడ్, భైరయ్య, రఫీక్, అశోక్, రాజు, రవిలతో పాటు నాయకులు ఉన్నారు.



హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్న నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి

బూత్‌బంగ్లాగా పేదల కల్యాణవేదిక

- శిథిలావస్థకు చేరిన షాదీఖాన
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- నిధులు మంజూరీ లేక మరమ్మతులు కరువు



శిథిలావస్థకు చేరిన షాదీఖాన



కిటికీలు, దర్వాజలు లేని దృశ్యం

బిచ్కుంద, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పేద మైనారిటీల కోసం మండల కేంద్రంలో రెండుదశాబ్దాల క్రితం నిర్మించిన షాదీఖాన భూత్‌బంగ్లాగా మారింది. మరమ్మతులకు నిధుల్లేక భవనం శిథిలావ్యవస్థకు చేరి నిరుపయోగంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 2002లో మాజీ ఎమ్మెల్యే అరుణతార ఉన్నప్పుడు పేద ముస్లిములు పెళ్లిళ్ల కోసం పంచాయతీరాజ్ నిధులతో షాదీఖాన నిర్మించారు. ఆ నాటి నుంచి నేటివరకు షాదీఖానకు మరమ్మతులు చేపట్టకపోవడం, ఊరిచివర ఉండడంతో షాదీఖాన దర్వాజాలు, కిటికీలను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకుపోయారు. కిటికీలు, దర్వాజాలు లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. మరమ్మతుల కోసం నిధులు ఇవ్వాలని మైనార్టీ నాయకులు పలుమార్లు ఎమ్మెల్యేలను కోరినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో మండలంలోని చాలామంది పేదల ముస్లింల వివాహాలు, ఇతర శుభకార్యాలు జరుపుకోవడానికి వీల్లేకుండా భూత్‌బంగ్లాగా మారిపోయిందని ముస్లిములు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కల్యాణ మండపాలు వివాహాలకు 40వేల నుంచి 75వేల వరకు కిరాయి డిమాండ్ ఉండడంతో అంత డబ్బులు చెల్లించి స్థోమత లేని పేదల పెళ్లిల అవసరాలను దృష్టిలో పెట్టుకొని షాదీఖానకు మరమ్మతులు చేయించాలని మండల మైనారిటీ ప్రజలు కోరుతున్నారు

మరమ్మతులు చేయించాలి

• మురాద్ అలీ, షాదీఖాన, మాజీ చైర్మన్



శిథిలావస్థకు చేరకుఉన్న షాదీఖాన మరమ్మతుల కోసం చాలా సార్లు అధికార ఎమ్మెల్యేలను సంప్రదించాం. ఫలితం లేకుండా పోయింది. పేద ముస్లింలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న షాదీఖానకు నిధులు మంజూరు చేసిన మరమ్మతులు చేపట్టాలి.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



దివ్యాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న నాయకులు

కామారెడ్డిటౌన్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన కడారి లింగం, కామారెడ్డి హరిజనవాడకు చెందిన రాజ్‌వీర్‌సింగ్, 36వ వార్డుకు చెందిన కుమ్మరి లలిత లకు తన స్వంత నిధులతో ట్రైసైకిళ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని, పేద ప్రజల అభివృద్ధికి పలు సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చి అందరికి సమన్యాయం చేస్తుందని తెలిపారు. తనవంతుగా పేదలకు ఆర్థిక సహాయంతోపాటు పలు పరికరాలను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నిమ్మ విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చాట్ల వంశీ, మామిండ్ల రమేష్, జుల్లూరి సుధాకర్, పిడుగు మమత, శంకర్‌రావు, గడ్డమీది మహేష్, ఉర్దొండ రవి, మామిండ్ల అంజయ్య, సబ్బని హరికృష్ణ, ఇస్రోజీవాడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘ అభివృద్ధి పనులకు భూమిపూజ



ఎమ్మెల్యేతో రెడ్డి సంఘం-1 సంఘ సభ్యులు

దోమకొండ,(బీబీపేట) నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దోమకొండ, బీబీపేట మండలాల్లోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి వివిధ కులసంఘాల అభివృద్ధి పనులకు ఆయన సొంత నిధులతో నిర్మాణం చేపట్టేందుకు పనులు ప్రారంభించి, భూమిపూజ చేశారు. దోమకొండ మండలంలోని సంగమేశ్వర్ విశ్వబ్రాహ్మ సంఘం భూమిపూజ, దోమకొండ గౌడ సంఘం భూమి పూజ, రెడ్డి సంఘం-1 ఫంక్షన్‌హాల్ ప్రారంభోత్సవం, బీబీపేట మండలంలోని శివారురామ్ రెడ్డిపల్లి కుర్మసంఘం ఫంక్షన్‌హాల్ భూమిపూజ, జనగామ కుర్మ సంఘం ఫంక్షన్‌హాల్ భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఆయా కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జనవరి 14 వరకు అయ్యప్ప స్వామి మండల పూజలు

కామారెడ్డి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో జనవరి 14 వరకు స్వామి వారి మండల పూజ మహోత్సవాలు, చండీయగం, నిత్య అన్నప్రసాద కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి గోనే శ్రీనివాస్‌లు తెలిపారు. శుక్రవారం మొదటి రోజు స్వామి వారి పూజ కార్యక్రమాలు నిర్వహించి అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోడ్డు వేయాలని వినతి

కామారెడ్డిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 25వ వార్డులో సీసీ రోడ్డు పనులు చేపట్టాలని శుక్రవారం వార్డు ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామారెడ్డి రోడ్డు నుంచి ప్రకాష్‌రావు హాస్పిటల్ పక్క నుంచి సీసీ రోడ్డు పనులు చేపట్టాలని అన్నారు. ఇండ్ల నిర్మాణం జరిగి ఏండ్లు గడుస్తున్న ఇంక మట్టి రోడ్డే ఉండడంతో చిన్న పాటి చినుకు పడ్డ నాన అవస్థలు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన బారీ వర్షానికి మట్టి రోడ్డు సైతం కొట్టుకుపోయిందని, రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. మున్సిపల్ అధికారులు సందర్శించి తగిన విధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీనివాస్, నర్సింహారెడ్డి, కృష్ణచైతన్య, పాల్గొన్నారు.

విండో చైర్మన్‌గా మద్ది స్వామి బాధ్యతల స్వీకరణ

భిక్కనూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలతో భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామ విండో చైర్మన్‌గా మద్ది స్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో బస్వాపూర్ విండో పరిధిలో ఉన్న కాచాపూర్‌ను ప్రత్యేక విండోగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించగా బస్వాపూర్ విండో చైర్మన్ పదవీపై బీఆర్ఎస్, కాంగ్రెస్ హైకోర్టుకు వెళ్లాయి. ఈ మేరకు మద్ది స్వామి(బీఆర్ఎస్)ని విండో చైర్మన్‌గా నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయగా శుక్రవారం ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్వామి మాట్లాడుతూ న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విండో సీఈవో మహేశ్వరీ, విండో డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో నాణ్యమైన సేవలు అందించాలి

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, గాంధారి, లింగంపేట్ మండలాల అంగన్‌వాడీ టీచర్ల ప్రత్యేక సమావేశాన్ని సీడీపీవో స్వరూప రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే ప్రాజెక్టు సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో నాణ్యమైన సేవలు అందించాలని, పిల్లల ఎదుగుదలకు ఎప్పటికప్పుడు పర్యావేక్షించాలన్నారు. పిల్లలకు, గర్భిణీలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం కేంద్రాల్లో అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ప్రసన్న, ఆయాసెక్టార్ల సూపర్‌వైజర్‌లు హారతి, లత, ఈశ్వరీ, భారతి, వినోదిని, వైష్ణవీ, స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో స్వరూప రాణి

పాల్కంపేట బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక



పాల్కంపేటలో నూతన అధ్యక్షుడితో బీఆర్ఎస్ కార్యకర్తలు

లింగంపేట, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని పొల్కంపేట బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షునిగా విఠల్‌ను ఎన్నుకున్నట్లు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ తెలిపారు. శుక్రవారంమాజి ఎమ్మెల్యే సురెందర్ ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో గ్రామ బీఆర్ఎస్ కార్యకర్తలు సమావేశమై విఠల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆరఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు 100మంది సమావేశమయ్యారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కొత్తలోక
ప్రియ 35- లిటిల్ హార్ట్స్
దర్శన్- మిఠాయి

బాన్సువాడ

మహేశ్వరి బ్రహ్మాండ
వెంకటేశ్వర కూలీ

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230

పిల్లలకు అక్షరాభ్యాసం.. టీచర్లకు టెట్ అభ్యాసం

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఓ వైపు విద్యార్థులకు పాఠాలు చెబుతునే మరోవైపు టెట్‌కు సిద్ధమవుతున్నారు. ఒకవేల టెట్ రాయకుంటే ఉన్న ఉద్యోగం ఊడుతుందని, కనీసం పదోన్నతికూడా లభించదని ఉపాధ్యాయుల్లో టెన్షన్ నెలకొంటుంది. ఈ నెల 29 వరకు టెట్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

ఆందోళనలో ఉపాధ్యాయులు

జిల్లాలో 5వేలకు పైగా జీహెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్‌జీటీ ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో టెట్ రాయకుండా వృత్తిలో కొనసాగుతున్న వారే సగానికి పైగా ఉన్నారు. టెట్ అర్హత తప్పనిసరి కావడం, రాయని పక్షంలో స్వచ్ఛంద పదవి విరమణ,నిర్బంద తొలగింపు టీచర్లను కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ఎస్‌జీటీలు వృత్తి ఇంక్రిమెంట్ రావాలన్నా, స్కూల్ అసిస్టెంట్‌లు ప్రమోషన్‌లు పొందాలన్నా డిపార్ట్‌మెంట్ పరీక్ష ఈవోటీ(ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టెస్ట్) రాస్తారు. ఇప్పటికే 20 ఏళ్లకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న చాలామంది టెట్ అర్హత లేదు. దీంతో భవిష్యత్‌లో పదోన్నతులు, బదిలీలు, వేతన ఇన్‌క్రిమెంట్ ప్రభావితమవుతాయన్న భయం వారిని పట్టుకుంది. నియామక సమయంలో టెట్ విదానం లేకపోయిన, ఇప్పుడు మధ్యలో మార్గదర్శకాలు మార్చడం అన్యాయమని వారు వాపోతున్నారు. విద్యాశాఖ మాత్రం కేంద్రమార్గదర్శకాలను అనుసరించి టెట్ ప్రమాణాలను అమలుచేయక తప్పదని పేర్కోంటుంది.

పొగచూరుతున్న బాల్యం

(5వ పేజీ తరువాయి)

ఇబ్బందులు ఏర్పడవచ్చు.

అధికారులు దృష్టి సారించాలి

ప్రభుత్వం మనఊరు - మనబడి వంటి కార్యక్రమాల కింద పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాల కల్పనకు శ్రీకారం చుట్టింది. కాగా వంట గదుల నిర్మాణంలో మాత్రం అధికారులు దృష్టి సారించలేకపోయారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల ఆరోగ్యం , ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో నాణ్యమైన వంట గదుల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పసికందు విక్రయానికి యత్నం?

(5వ పేజీ తరువాయి)

అప్పగించారు. శిశువు ఆరోగ్య పరిస్థితిని అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్రఆవేదన వ్యక్తంచేశారు. పేదరికం, అవగాహనలేమి ఇలాంటి చర్యలకు దారి తీస్తోందని పలువురు వ్యాఖ్యానించారు. ఇక మహిళపై చట్టపరమైన చర్యలు తీసుకునే అంశంపై బాలల సంక్షేమశాఖ అధికారులు సమీక్షిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని స్థానికులు అంటున్నారు. కాగా బాల విక్రయాలు పూర్తిగా నేరమని, ఎవరైనా ఇలాంటి సమాచారం తెలిసినా వెంటనే తెలియజేయాలని పోలీసులు కోరారు. బాన్సువాడలో జరిగిన ఈ ఘటన ప్రస్తుతం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

'మద్యం దుకాణాలను తరలించొద్దు'

గాంధారి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలను గాంధారి మండలకేంద్రం నుంచి తరలిస్తే ఊరుకునేది లేదని వీడీసీ ప్రతినిధులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఎక్సైజ్ సూపరిండెంట్‌కు వారు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ ప్రతినిధులు, నాయకులున్నారు.

సంక్షేమ పథకాలపై కళాబృందం ప్రచారం

లింగంపేట, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారం గ్రామంలో శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇల్లును నిర్మించుకునేందుకు రూ.5లక్షలు ఆర్థిక సహాయం చేస్తుందని, పేదలకు 200యూనిట్ల విద్యుత్‌ను ఫ్రీగా అందిస్తుందని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతోపాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తుందని వారు పాటలు, మాటలతో వివరించారు. యువత మత్తుపదార్థాలకు బానిసలుగా మారవద్దని, వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని వారు ఆకట్టుకునే పాటలతో వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు అకుల మహేందర్, రమేష్‌రావు, నాగరాజు, రాము, కాశీరాం, లక్ష్మీనారాయణ, పోశెట్టి, నరేష్, కళాకారులు ఉన్నారు.

మద్యం దుకాణాలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయవద్దు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దోమకొండ గ్రామస్తులు

దోమకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):నూతనంగా ఏర్పాటు చేసే మద్యం దుకాణాలను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని శుక్రవారం దోమకొండలో గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ప్రధాన కూడలిలో దుకాణాలను ఏర్పాటు చేస్తే ప్రయాణీకులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పెర్కోన్నారు. కార్యక్రమంలో వేణుమాధవ్, రాగుల నరేష్‌గౌడ్, రాహుల్, ఎర్ర వెంకటేష్, రావుల శ్రావణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

బాన్సువాడ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన మాజీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఉద్దెర చిన్న హన్మండ్లు రెండు రోజుల క్రితం గుండె పోటుకు గురై నిజామాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కార్పోరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను ఓదారిచ కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. హన్మండ్లు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. అనంతరం అంత్యక్రియల్లో కాసుల హన్మండ్లు పాడేను మోశారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి



వందేమాతర గీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు

లింగంపేట, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : వందే మాతర గీతం దేశాభిమానానికి ప్రతిక అని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు క్రాంతికుమార్ అన్నారు. శుక్రవారం వందే మాతరం జాతీయ గీతం 150 సంవత్సరాల వేడుకలను బాలుర ఉన్నత పాఠశాల, శిశుమందిర్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తి, ఐక్యత, జాతీయ గౌరవానికి ప్రతీక వందేమాతర గీతం అని ఆయన విద్యార్థులకు తెలియజేశారు. వందే మాతరం గీతం మన స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణగా నిలిచిందని, ఈ వేడుకలు ప్రతీభారతీయుడిలో దేశభక్తిని, ఐక్యతను, జాతీయ గౌరవాన్ని మరింత బలపరుస్తాయన్నారు. జాతీయ గీతం పట్ల గౌరవ భావాన్ని పెంపొందించాలని, దేశ నిర్మాణంలో ప్రతీ ఒక్కరూ తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.